# 23. త్యాగం ఒకరిది, కీర్తి మరొకరిది

"నీ క్కావలసిన పుస్తకం మా అబ్బాయి శివనాథం ద్వారా పంపుతున్నాను. వాడు ఈ నెల 29 సాయంకాలం ఆరున్నరకి మీ వూరు చేరే సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లో వస్తున్నాడు. ఫస్ట్‌క్లాస్‌లో వస్తాడు కనుక వాడిని సులువుగానే గుర్తుపడతావు . స్టేషన్ కెళ్లి ఆ పుస్తకం తీసుకో" అని సర్వేశ్వర్రావు ఉత్తరం రాస్తే స్టేషన్ కెళ్లాను, నిన్న సాయంకాలం. పుస్తకం పుచ్చేసుకుని దూరంగా జరుగుతూ "నువ్వెక్కడ బసచేస్తావు" అన్నాను మాటవరసకి, "ఎక్కడైనా హోటల్లో రూమ్ తీసుకోవాలి" అన్నాడు. "పోనీ ఓ పూట మా ఇంట్లో వుండు" అన్నాను. "అయితే పదండి" అనేశాడు.

స్నానం, భోజనం అవగానే "నాకు రెండు మూడు గంటలు పనున్నాది. ఆ టేబిలూ, కుర్చీ నాకు వదిలేస్తారా?" అన్నాడు శివనాథం. "ఓ అలాగే" అని ఆ టేబిలు కుర్చీతోబాటు గదంతా ఖాళీ చేసి ఇచ్చేశాను. వెంటనే పెద్ద లైటు ఆర్పేసి టేబిలు లైటు వెలిగించుకుని పుస్తకాలు పరుచుకుని కూర్చున్నాడు. అతన్ని డిస్టర్బ్ చేస్తున్నానని తెలిసినా, మరీ అంత వెంటనే లోపలికి పోయి నిద్రపోవడం నచ్చక నేను కూడా అక్కడే ఓ కుర్చీవేసుకుని కూర్చున్నాను.

ఒకటే పుస్తకం, నాలుగు కాపీలు, తెరిచి ఒక సన్నటి పాయింటున్న పెన్ తీసుకొని తప్పులు కాబోలు, దిద్దుతున్నాడు. పేజీ పేజీ శ్రద్ధగా చూస్తూ.

"ఏమిటి, ఆ గ్రంథం?" అన్నాను.

"ఇది డాక్టరేట్ కోసం నా థీసిస్సు"

"ఏమిటి, నీ సబ్జెక్టు?"

"ఎం.ఏ. పాలిటిక్స్ చేశాను."

"అది కాదు నేనడగడం; డాక్టరు పట్టా కోసం పరిశోధన ఏ విషయం మీద చేశావని అడుగుతున్నాను."

"స్వాతంత్ర్యానంతరం, భారత రాజకీయాల్లో త్యాగం, సత్యాగ్రహం - వీటి పాత్ర, పాత్రత"

"అబ్బా! చాలా మంచి సబ్జెక్టే."

"నిన్న సాయంకాలమే టైపింగు పూర్తయింది. నిన్న రాత్రి బైండర్ని కూర్చోబెట్టి బైండింగ్ చేయించడమైంది. తప్పులు దిద్దేస్తే ఇచ్చేయొచ్చు."

"నేనొకసారి తిరగెయ్యొచ్చునా?" అన్నాను. శివనాథం సందేహంగా చూసేడు. "నీ పనికేమీ అడ్డురాను. నేను కూడా ఒక పెన్ తెరిచి పట్టుకుంటాను. నువ్వు పేజీ నెంబరు. లైన్ నెంబరు చెప్తే ఒక కాపీలో తప్పులు నేను దిద్దుతాను." అని చెప్పేక ఒప్పుకున్నాడు.

స్వాతంత్ర్యం వచ్చేక త్యాగానికీ, సత్యాగ్రహానికీ ఆకారాలు పూర్తిగా మారిపోయాయని శివనాథం సిద్ధాంతం చేసేడు.

భారతీయులు అందరికీ ఉండే సామాన్యమైన సమస్యల పైన అహింసాయుతంగా

జరుగుతూ ఉండే సత్యాగ్రహాలు క్రమంగా ప్రాంతీయ ప్రయోజనాలకీ, మరీ తక్కువ మంది ప్రయోజనం పొందే కారణాలకీ వ్యాపించడమే కాక, సర్వ సాధారణంగా సత్యాగ్రహం అనేది హింసాత్మకంగానే సాగుతోంది - అని చెప్పడానికి భాషా రాష్ట్ర ఉద్యమాల నుంచి మత పరమైన ఆందోళనలు వరకు ఎన్నో ఉదాహరణలు, వార్తా పత్రికల నుంచి సేకరించిన సంఘటనలు అందులో ఉన్నాయి.

అహింసా పద్ధతిలో సత్యాగ్రహ ఉద్యమాలు నడిచిన ఈ దేశంలో గాంధీ నుంచి ఇందిరా గాంధీ వరకు, ఇందిరా గాంధీ నుంచి రాజీవ్ గాంధీ వరకు రాజకీయంగా, సాంఘికంగా ఎటువంటి పరిణామాలు సంభవించాయో వివరంగా వ్రాశాడు శివనాథం. స్వాతంత్ర్యం వల్ల స్వేచ్ఛ రుణభారంలా వచ్చిందన్నాడు.

ఎక్కడో ఎవడో హత్యకి గురి అవుతాడు. హత్యకి గురి అయినవాడు గాంధీ మహాత్ముడా లోకకంటకుడా అనే వివక్ష లేకుండా అతని బంధువులని, కులం వాళ్లని, అతనికి రాజకీయ పార్టీ ఉన్నా లేకపోయినా ఏదో ఒక పార్టీ వాళ్లని రెచ్చగొట్టి గృహ దహనాలు, లూటీలు చేయించే పెద్దలు తయారవుతున్నారని సోదాహరణంగా చెప్పేడు.

ఎవడో ఎవడ్నో ఏదో అంటే చాలు. వాడు అలా ఎందుకు అనాలి అనేది అనిపించుకున్న వాడికన్నా ఎక్కువగా మిగిలిన వాళ్లకే పట్టి, ఆ మాటని ఉపసంహరించుకోవాలని కోరుతూ ఆందోళన ప్రారంభం అవుతుందన్నాడు. ఆమరణ నిరాహార దీక్షలు "వృత్తులు" గా పరిణామం చెందాయన్నాడు. రిలే నిరాహార దీక్షలు ఉదయం నుంచి సాయంకాలం వరకే కనుక "త్యాగం" ఏమీ లేకుండానే "ఉద్యమం" కనబడే లాభం ఏర్పడిందన్నాడు.

అతి స్వల్పమైన కారణాల వల్ల నిర్ణయం అయ్యే "బంద్"లు మన దేశానికి ఎంతటి అవమానం, నష్టం తెచ్చి పెడుతున్నాయో చూడమని ఒక అధ్యాయం కేటాయించాడు.

బంద్ అనేది ఆత్మహత్యా సదృశమైన ప్రతిపాదన.

బంద్ వల్ల ఉత్పత్తి ఆగిపోయి నష్టం సంభవిస్తుంది.

బంద్ కొద్ది గంటలో రోజులో మాత్రం సాగడం వల్ల బంద్‌కి కారణమైన దుశ్చర్యకు పాల్పడిన వారు ఆ కాసేపు ఓపిక పట్టి మళ్లీ యథా ప్రకారం ప్రవర్తిస్తున్నారే తప్ప బంద్ వల్ల ఏ దుశ్చర్యలనూ ఎవరూ మానడం లేదు. "బంద్" వలన కలిగే నష్టాలకు పరిహారాలుండవు.

బంద్‌వల్ల ముఖ్యంగా దెబ్బ తినేది పేద ప్రజలు. రెక్కాడితేగాని డొక్కాడని రోజువారీ ఆదాయం గలవాళ్లు వాళ్ల కుటుంబాలతో సహా బంద్ రోజుల్లో ఆకలికి మాడక తప్పదు. రిక్షాలు తొక్కుకునే వాళ్లు, తట్టలతో కూరగాయలు తెచ్చి వీధి వీధి తిప్పి అమ్ముకునే వాళ్లు, చెప్పులు మరమ్మత్ చేసుకునే వాళ్లు, చిన్న చిన్న టీకొట్లు, బటానీలు, మసాలా పప్పులు, తోపుడు బండ్లమీద పెట్టుకుని జీవితాల్ని తోసుకునేవాళ్లు, క్షుర కర్మ చేసి దినం గడుపుకునే వాళ్లు బంద్ రోజుల్లో ఏమీ సంపాదించుకోలేరు. వాళ్లకి సేవింగ్స్ ఉండవు. "సమాజంలోని అట్టడుగు వర్గాల ప్రయోజనమే మా పార్టీ ధ్యేయం" అని చెప్పుకునే ఏ పార్టీకి కూడా బంద్ నిర్వహించే అధికారం లేదు. (అన్ని పార్టీలు చెప్పేది అదే!)

మధ్యతరగతి ప్రజలు ముఖ్యంగా ఉద్యోగులు భోజనం కోసం అవస్థపడక పోయినా,

ఆఫీసులకి చేరలేక, సైకిళ్లకి, స్కూటర్లకి అపాయాలు కొని తెచ్చుకొని, ఒక్కొక్క సందర్భంలో దెబ్బలు తిని ఎలాగో చేరగలగవచ్చు. కాని అలా కూడా ఆఫీసులకి చేరలేని వాళ్లు ముఖ్యంగా మహిళా ఉద్యోగులు - ఆ రోజు సెలవు గ్రాంటు కాక జీతాలు నష్ట పోతారు. వాళ్ల మీద అధికారులు శాఖాపరమైన చర్య తీసుకోవచ్చు. సర్వీస్ బ్రేక్ కావచ్చు. కాన్ఫిడెన్షల్‌లో చెడ్డ రిమార్కు పడవచ్చు.

బంద్ దినాల్లో రిక్షాలూ, ఆటోలూ, బస్సులూ, రైళ్లూ నడవక పోవడం వల్ల ప్రయాణాలు ఆగిపోయి అన్ని తరగతుల ప్రజలకు పనులు అవవు. ఆసుపత్రుల వరకు ప్రయాణం చేయలేని రోగులు మార్గమధ్యంలో ప్రాణాలు పోగొట్టుకున్న సందర్భాలు అనేకం.

సాధారణమైన దినాల్లో బాధ్యత గల పౌరులుగా వ్యవహరించే వారు కూడా బంద్ రోజుల్లో క్రూరంగా ప్రవర్తించి షాపులు లూటీ చెయ్యడం నుంచి సాటి మనిషిని హింసించే వరకు దిగజారిపోతున్నారు.

అధికారులు, రాజకీయ నాయకులు కార్లలో తిరిగి "బంద్ సక్సెస్" అవునా కాదా నిర్ణయించే మహత్తరమైన బాధ్యత చేపట్టినా, "బంద్ విజయవంతం" అంటే "ప్రజలు విఫలులైనారు" అనే అర్థాన్ని గ్రహించలేని మూఢులు అవుతున్నారు.

నాలుగు వందల యాభై పేజీలకి సాగిన ఆ పరిశోధనా గ్రంథంలో పేజీ పేజీ చదివి తప్పులు పట్టుకుని దిద్దడం పూర్తి చేసేసరికి రాత్రి ఒంటిగంటన్నర అయింది.

"చాలా బాగుందోయ్, నీ థీసిస్సు." అన్నాను.

"ఉదయం కొంచెం తొందరగా లేపండి. ఎనిమిది గంటల కల్లా ఈ థీసిస్ కాపీలు యూనివర్సిటీలో ఇచ్చెయ్యాలి. ఆగస్టు 30 లోగా ఈ థీసిస్ చేరకపోతే ఇది పరిశీలనకి అర్హత కోల్పోతుందని వార్నింగ్ ఇచ్చేరు" అన్నాడు శివనాథం.

"నీ థీసిస్ ఈ రోజు చేరదు, నీకు డాక్టరేటు రాదు. ఎందుకంటే ఇవాళబంద్!" అని నేను లేచిపోయాను.

★

# 24. దేవుడి దయ

**మా** నాన్నగారికి దేవుడంటే నమ్మకం లేదు.

"దేవుడు అనేది మనిషి మెదడులో పుట్టిన అందమైన భావాల్లో ఒకటి. మనుషులు తమ చేత కాని తనానికి నష్టాలు పొందినప్పుడూ, తమ అతిచాతుర్యం వల్ల సాటి మనుషుల్ని మోసంచేసి లాభాలు పొందినప్పుడూ సమానమైన విరక్తితో చెయ్యగల ఒకానొక వ్యాఖ్యానం "దేవుడి దయ" - అనేవారు ఆయన.

నాకుజ్ఞానం వచ్చేక ఓసారి ఆయన దేవుడి గురించి, దేవుడి దయ గురించి చేసే వ్యాఖ్యానాలు విని మా నాన్నగార్ని ఎదురు ప్రశ్న వేసాను. "మీరేమో దేవుడు లేడంటారు. మరి అమ్మ మాత్రం కేలండరులో ఉన్నవి, సాటివాళ్లు చెప్పినవి అన్ని రకాల నోములు, వ్రతాలు,